ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -127 పేజీలు - 04 వెల - 04/- గురువారం 11 జూన్ 2026

# ఎన్‌డీయే కుటుంబం ఉమ్మడి విజయం



## ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం



- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, జూన్ 10, ఆంధ్ర ప్రగతి**

కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. **మిగతా 2లో...**

## పశ్చిమాసియాలో కల్లోలం

**-హర్మూజ్ వద్ద ఇరాన్ లక్ష్యాలపై అమెరికా దాడులు**

**-గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై టెహ్రాన్ ప్రతిదాడి**



**టెహ్రాన్/వాషింగ్టన్ : జూన్ 10,ఆంధ్ర ప్రగతి**

దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా అట్టుడికిపోతోంది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, ఆరోపణలు-ప్రత్యారోపణలు చేసుకుంటూ అమెరికా, ఇరాన్ పరస్పర దాడులకు దిగుతున్నాయి. హర్మూజ్ జలసంధి పరిసరాలలోని ఇరాన్ లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతిగా జోర్డాన్, కువైట్, బహ్రేన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు బుధవారం **మిగతా 2లో...**



## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

**నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ**

**న్యూఢిల్లీ, జూన్ 10,ఆంధ్ర ప్రగతి**

నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి **మిగతా 2లో...**

## మూగబోయిన పల్లె గొంతుక

**దిగ్గజ దర్శకుడు భారతీ రాజా ఇకలేరు...**

**సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి..పలువురి నివాళి**



**చెన్నై : జూన్ 10,ఆంధ్ర ప్రగతి**

'మిన్నేటి సూరీడు వచ్చేనమ్మా... పల్లె కోనేటి తామర్లు విచ్చేనమా..' అంటూ పల్లె మాటను మంత్రం చేసి, 'ఈ మమతే ..ఈ సమతే మంగళవాద్యం'అంటూ గ్రామీణ జీవన బంధాలను వెండితెరపై **మిగతా 2లో...**

## 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**లేకుంటే దేశవ్యాప్త ఆందోళనలు**

**కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) పిలుపు**

**నేడు పూణేలో ఆందోళన ఆ తర్వాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ లో..**

**20న జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ధర్నా**




**న్యూఢిల్లీ జూన్ 10,ఆంధ్ర ప్రగతి** దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈనెల 13లోగా రాజీనామా చేయాలనీ, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చింది. **మిగతా 2లో...**

## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్



**కేంద్ర కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా నిర్మాణాలు**

**రూ.2,500 కోట్లతో ఐదు ఎకరాల్లో నిర్మాణానికి అనుమతి**

**17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెసిడెన్షియల్ కాంప్లెక్స్**

**కేంద్ర కేబినేట్ నిర్ణయం తీసుకుందున్న మంత్రి పెమ్మసాని**

**న్యూఢిల్లీ, జూన్ 10ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించిన వివరాల ప్రకారం, అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అమరావతి నిర్మాణానికి మరింత ఊతమివ్వనుంది**మిగతా 2లో...**

## ఉత్తర,దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం

**జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద**

**అక్కడి కి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది**

**మీడియాతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**న్యూఢిల్లీ, జూన్ 10, ఆంధ్ర ప్రగతి**

జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం **మిగతా 2లో...**





## ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

**ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, జూన్ 10,ఆంధ్ర ప్రగతి**

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. **మిగతా 2లో...**

## భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

**కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం**

**బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ**

**ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు**



# ఎన్‌డీయే కుటుంబం ఉమ్మడి విజయం

**మొదటిపేజీ తరువాయి**

ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్-370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

**. మొదటిపేజీ తరువాయి**

ప్రణాళిక ప్రకారం 5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక ఆఫీస్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. ఇందులో రెండు భారీ టవర్లను ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకుని రానున్నారు. అలాగే 1,800 కార్లకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పించేలా ఆధునిక మౌలిక వసతులతో ఈ కార్యాలయ సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇదే ప్రాజెక్టులో భాగంగా రూ.1,234 కోట్ల వ్యయంతో 17 ఎకరాల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను కూడా నిర్మించనున్నారు. 11 టవర్లలో మొత్తం 1,568 నివాస క్వార్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పెమ్మసాని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో కూడిన గేటెడ్ కమ్యూనిటీగా ఈ నివాస సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. 2018లో తొలిసారిగా ప్రతిపాదించబడిన ఈ ప్రాజెక్టు పలు కారణాలతో ముందుకు సాగకపోయినా, 2024 తర్వాత వేగం పుంజుకుని ప్రస్తుతం ఆమోద దశకు చేరుకుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, కేంద్ర ఆర్థిక శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారం వల్లే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమరావతిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు రాజధాని అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర పడిందని వివరించారు.

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

## కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం

## బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ

## ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు

**విశాఖపట్టణం, జూన్ 10,ఆంధ్ర ప్రగతి** స్టీల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. బుధవారం విశాఖను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ఎ÷-లాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని జగన్ ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని సమాధానం ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన



ప్రమాదం నేపథ్యంలో జగన్‌మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించిన ఆయన, బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రానికి రెండు లేఖలు కూడా రాశామని అన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల పక్షాన నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై గట్టిగా కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం సుమారు 10,500 మందిని తొలగించారని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్ట్, రెగ్యులర్ కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వ నేతలు చెబుతున్నారని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ (÷ఎఖా), బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇచ్చిందని గుర్తు చేసిన జగన్, అదే తరహాలో స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని జగన్ కోరారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు కొంత ఓపిక పట్టాలని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోటి రూపాయల పరిహారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి బయలుదేరారు.

# ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**

ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# పశ్చిమాసియాలో కల్లోలం

**మొదటిపేజీ తరువాయి**

క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించారు. ఏప్రిల్‌లో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున ఘర్షణలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. హర్మూజ్ సమీపంలో అమెరికా అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ మంగళవారం కూల్చివేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులు జరపాలని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సేనలను ఆదేశించారు. దీంతో అమెరికా సేనలు హర్మూజ్ పరిసరాలలోని ఇరాన్ లక్ష్యాలపై దాడులు జరిపాయి. అలాగే ఇరాన్ చర్చల విషయంలో ఆలస్యం చేసిందని, అందుకు భారీ మూల్యం చెల్లించుకుంటుందని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. అయితే యుద్ధ పరిస్థితుల్లో సంయమనం పాటించాలని రష్యా ఇరు దేశాలను కోరింది. అలాగే పశ్చిమ ఆసియాలోని సంఘర్షణపై తాము "తీవ్ర ఆందోళన" వ్యక్తం చేస్తున్నామని, ఉద్రిక్తతలను పెంచవద్దని చైనా ఇరు పక్షాలకు విజ్ఞప్తి చేసింది. అమెరికా ప్రతీకారం బలంగా, శక్తివంతంగా ఉంటుందని దాడులకు ముందు ట్రంప్ మీడియాకు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్లు, నిఘా రాడార్ ప్రదేశాలపై తాజాగా దాడులు చేశామని అమెరికా సైన్యం ప్రకటించింది. ఈ దాడులు నాలుగు గంటల పాటు కొనసాగాయి. దాదాపు 20 ఇరాన్ లక్ష్యాలపై దాడులు జరిగాయని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. హర్మూజ్ పరిసరాలలోని మూడు వ్యూహాత్మక ప్రదేశాలలో పేలుడు శబ్దాలు వినిపించాయి. రెండు నీటి రిజర్వాయర్లపై కూడా అమెరికా దాడి చేసిందని, దీంతో ఆ ప్రాంతంలో ఇరవై వేల మందికి నీటి సరఫరా నిలిచిపోయిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది. ఈ రిజర్వాయర్ల నుంచి కౌహెస్‌టాక్ పట్టణానికి, దాని పరిసరాలలోని పది గ్రామాలకు తాగు నీరు సరఫరా అవుతోంది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ అధికారులు అత్యవసర చర్యలు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గాలలో నీటి సరఫరా చేస్తున్నారు. కాగా ఖెష్మ్ దీవి పైన, హర్మూజ్‌లోని ఓడరేవు నగరమైన సిరిక్ పైన అమెరికా దాడులు చేసిందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) తెలియజేసింది. అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా బహ్రేన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించామని చెప్పింది. ఎఫ్-35 ఫైటర్ జెట్ హ్యాంగర్లు సహా దూర శ్రేణి క్షిపణులతో జోర్డాన్‌లో అమెరికాకు చెందిన అల్-అజ్రఖ్ స్థావరంలోని నాలుగు ప్రదేశాలు, కమాండ్ కంట్రోల్ కేంద్రంపై రివల్యూషనరీ గార్డులు దాడులు చేశారు. అమెరికా మరోసారి దాడులకు దిగితే తమ స్పందన నిర్ణయాత్మకంగా ఉంటుందని హెచ్చరించారు.

# మూగబోయిన పల్లె గొంతుక

**మొదటిపేజీ తరువాయి**

ఆవిష్కరించిన భారతీయ సినిమా దిగ్గజ దర్శకుడు భారతీ రాజా (84)ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన బుధవారం తెల్లవారుజామున చెన్నైలో తుది శ్వాస విడిచారు. 'అలలు కలలు ఎగిసి ఎగిసి అలసి సొలసి పోయే…'అంటూ ఆయనే చిత్రీకరించినట్లు గ్లామర్ ప్రపంచానికి, ఇండోర్ సెట్లకు పరిమితమైన సినిమాను పల్లెటూరి మట్టిలోకి, సహజమైన వెలుగులోకి తీసుకురావడానికి నిర్విరామంగా కృషి చేసిన ఆయన ఇక శాశ్వత విశ్రాంతిలోకి జారుకున్నారు. తాను స్వయంగా హేతువాది అయిన ఆయన తన సినిమాల్లోనూ అభ్యుదయ భావజాలానికి పెద్దపీట వేశారు. కులాంతర ప్రేమలకు మద్దతివ్వడం, గ్రామీణ మూఢనమ్మకాలపై ఎలుగెత్తడం, మానవత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం, మతాచారాల కంటే సామాజిక న్యాయానికి పట్టం కట్టడం, మహిళలు సాంప్రదాయ బంధనాల్లో కాకుండా స్వతంత్ర వ్యక్తులుగా కనిపించడం వంటి దృశ్యాలు ఆయన సినిమాల్లో సర్వసాధారణం. భారతీ రాజా మరణ వార్తతో సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. యావత్ భారత సినీ పరిశ్రమకు ఆయన భౌతికంగా లేకపోవటం తీరనిలోటని పలువురు సంతాపం తెలిపారు. కేవలం కథల్లోనే కాకుండా, మేకింగ్‌లో కూడా హేతుబద్ధతను పాటించారు. అప్పటివరకు తన సినిమాల ద్వారా "ఆరాధన అనేది కేవలం అభిమానంగానే ఉండాలి కానీ, అది మూఢభక్తిగా మారకూడదు" అని నమ్మి, తన ఫ్యాన్ అసోసియేషన్లను కూడా రద్దు చేయమనడం ఆయన హేతుబద్ధ ఆలోచనకు నిదర్శనమని సినీ రంగ ప్రముఖులు గుర్తు చేసుకున్నారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.

# 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు దేశ యువత భయపడటం లేదని తెలిపింది. నేడు పూణేలో ఆందోళన చేపట్టనుంది. ఆ తరువాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్‌ల్లో కూడా ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించింది. అదే విధంగా ఈనెల 20న జంతర్ మంతర్ వద్ద నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించింది. "పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా లక్షలాది కుటుంబాలు, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఇది ఒక జాతీయ సమస్య.పదేపదే జరుగుతున్న ఈ వైఫల్యాలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించడంలో విఫలం అయ్యారు. జవాబుదారీతనం ఉన్నత స్థాయి నుంచే ప్రారంభం కావాలి. అందుకే మేము ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పునరుద్ఘాటిస్తున్నాం" అని సీజేపీ పేర్కొంది.దేశ విద్యా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి, సంస్థాగత వైఫల్యానికి ఏ విద్యార్థి కూడా మూల్యం చెల్లించకుండా చూసేందుకు ఈ ఉద్యమం చేపట్టినట్టు తెలిపింది. జవాబుదారీతనం, న్యాయం కోసం జరిగే పోరాటంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాలు పంచుకోవాలని సీజేపీ పిలుపునిచ్చింది. పూణేలో జరిగే నిరసనలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని తెలిపింది.విద్యార్థులను ప్రభావితం చేసే సమస్యలపై దేశ యువత ఇకపై మౌనంగా ఉండేందుకు సిద్ధంగా లేదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసన చేపడతామని హెచ్చరించారు. . ప్రభుత్వం నైతిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ వంటి పరీక్షలకు సంబంధించిన సమస్యల కారణంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత తీసుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని అన్నారు. వ్యవస్థ వైఫల్యం కారణంగా, డాక్టర్లుగా ఎదిగి ప్రాణాలను కాపాడగలిగే విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని విమర్శించారు.

# ఉత్తర,దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం

**మొదటిపేజీ తరువాయి**

తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 11 జూన్ 2026

# శ్రీ శాంతి నికేతన్ స్కూల్‌లో సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ ప్రారంభం

## ..విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాల కల్పనకు మరో ముందడుగు.












**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 10:** నంద్యాల పట్టణంలోని శ్రీ శాంతి నికేతన్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ఎలైట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి , రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణ రెడ్డి , క్రాంతినగర్ టీడీపీ నాయకుడు శ్రీనివాసులు , కాపు సంఘ నాయకుడు మిలటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు అందించడంలో శ్రీ శాంతి నికేతన్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీబీఎస్ఈ ఎలైట్ బ్లాక్ విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.









# ఎస్ఐఆర్’కు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- కర్నూలు ఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- ఈ నెల 15 నుండి ఇంటింటికి బిఎల్వోలు
- ప్రజలు పత్రాలు, వివరాలు సిద్ధం చేసుకోవాలి

**ఆంధ్ర ప్రగతి కర్నూల్ టౌన్ జూన్ 10:** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్) ను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. బుధవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్‌పై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఈ నెల 15 నుండి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు)



ఇంటింటికి వస్తారని, వచ్చినప్పుడు బీఎల్‌వోలు అడిగే పత్రాలను, వివరాలను ప్రజలు ఇప్పుడే సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం బీఎల్‌వోలు మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిలో ఓటరు స్వయంగా పూర్తి చేసి బీఎల్‌వోకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఒక ఫారంపై బీఎల్‌వో సంతకం చేసి ఎక్నాలెడ్జ్‌మెంట్‌గా ఓటరుకు అందజేస్తారని చెప్పారు. ప్రజలు తమ ఈపిక్ (ఓటరు గుర్తింపు) కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే 2002 సంవత్సరంలో తాము లేదా తమ కుటుంబ సభ్యులు నమోదు అయి ఉన్న ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రం వివరాలు, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు లేదా నానమ్మల ఈపిక్ కార్డులు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ ప్రక్రియ మరింత సులభంగా జరుగుతుందని తెలిపారు. వివాహం తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు, తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ముందుగానే సేకరించి ఉంచుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరూ బీఎల్‌వోలకు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్వో కోరారు. త్వరలో బిఎల్వోలు, బిఎల్ఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తహాశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహాశీల్దార్ ధనుంజయ, మేనేజర్ జునైద్, సూపరింటెండెంట్ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతినగర్లో కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసి) నూతన శాఖ కార్యాలయం ప్రారంభం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్, జూన్ 10:** కార్మిక రాజ్య బీమా పథకం పరిధిలోని బీమా పొందిన కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్లో ఏర్పాటు చేసిన కార్మిక రాజ్య బీమా సంస్థ నూతన శాఖ కార్యాలయాన్ని ఈరోజు కార్మిక రాజ్య బీమా సంస్థ ఉప ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి జాయింట్ డైరెక్టర్ డి. రాధాకృష్ణ ప్రారంభించారు.
నూతన శాఖ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈఎస్ఐసి ఉప ప్రాంతీయ కార్యాలయం, తిరుపతికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు మధుసూదన్,రామకృష్ణ, జేడీఐఎంఎస్ కడప జాయింట్ డైరెక్టర్ డా. అబ్దుల్ కరీం, ఈఎస్ఐఐసి శాఖ కార్యాలయం, కర్నూలు బ్రాంచ్ మేనేజర్ బి. దుర్గా ప్రసాద్, రామకృష్ణ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీ రామకృష్ణ, నంద్యాల ప్రాంతంలోని ప్రముఖ యజమానుల ప్రతినిధులు, సుజలా పైప్స్, మహా సిమెంట్, జేఎస్ డబ్ల్యూ సంస్థల ప్రతినిధులు, బీమా పొందిన వ్యక్తులు , ఇన్సూరెన్స్ మెడికల్ ఆఫీసర్లు,







ఈఎస్ఐసి అధికారులు, సిబ్బంది, అలాగే ఈఎస్ఐసి స్టాఫ్ యూనియన్ తిరుపతి జాయింట్ సెక్రటరీ శ్రీ ఎం. రాజేష్ గారు మరియు వైస్ ప్రెసిడెంట్ ఎల్. సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీ డి. రాధాకృష్ణ కార్మిక రాజ్య బీమా పథకం ద్వారా అందించబడుతున్న వివిధ సామాజిక భద్రతా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డిపెండెంట్ బెనిఫిట్ పథకం గురించి వివరించి, అర్హులైన బీమా పొందిన వ్యక్తులకు డిపెండెంట్ బెనిఫిట్ సర్టిఫికెట్లను అందజేశారు. అదేవిధంగా, బీమా పొందిన వ్యక్తుల పిల్లలకు ఈఎస్ఐసి కోటా ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో నామమాత్రపు ఫీజుతో ప్రవేశం పొందే అవకాశాల గురించి వివరించి, కార్యక్రమానికి హాజరైన సభ్యులకు సమగ్ర సమాచారం అందించారు. నంద్యాల శాఖ కార్యాలయం ద్వారా జిల్లాలోని 1,035 మంది యజమానులు మరియు 17,958 మంది బీమా పొందిన వ్యక్తులకు వైద్య, నగదు మరియు ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు.

# దొంగ ఓట్లను గుర్తించి, తొలగించాలి.

-.నంద్యాల మండల టీడీపీ కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి.

-నంద్యాల టిడిపి కార్యాలయంలో మండల స్థాయి నాయకుల కీలక సమావేశం.

-ఓటర్ల జాబితా పరిశీలన, స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 10:** నంద్యాల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మండల స్థాయి నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, ఓటర్ల జాబితా సవరణ మరియు స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ఇందులో ఎలాంటి అక్రమాలకు తావుండకూడదని తెలిపారు . ఈ క్రమంలో ఎస్.ఐ.ఆర్ అంశంపై ఆయన నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 2002 నాటి ఓటర్ల లిస్టును, ప్రస్తుత 2026 ఓటర్ల లిస్టుతో క్షుణ్ణంగా సరిపోల్చి చూసుకోవాలని తెలిపారు. జాబితాలో నమోదై ఉన్న బోగస్ (దొంగ) ఓట్లను గుర్తించాలని అలాగే చనిపోయిన వారి ఓట్లు, ఈ ప్రాంతాన్ని పూర్తిగా ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన వారి ఓట్లు ఇంకా జాబితాలో ఉంటే వాటిని వేరు చేయాలని . ఇటువంటి అనవసరమైన ఓట్లను గమనించి, తక్షణమే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని ఓటర్ల జాబితా నుండి పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. తద్వారా దొంగ ఓట్లకు చెక్ పెట్టవచ్చని అన్నారు . త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, పార్టీ జెండాను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ చాబోలు ఇలియాస్, అయ్యలూరు త్రిలింగేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి పాలెం శంకర్ రెడ్డి, పెద్ద కొట్టాల రాజేష్, పుసులూరు పుల్లయ్య, భీమవరం వెంకటేశ్వరరెడ్డి, పోలూరు జయ చంద్రారెడ్డి, చాపిరేవుల భూపాల్ రెడ్డి, గుంతనాల నాగేశ్వరరావు, బిల్లలాపురం చిన్నయ్య, బాలుడు, కానాల జాకిర్ బాషా మరియు నంద్యాల మండల పరిధిలోని ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పకడ్బందీగా చేయాలి.

..స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు కావాలి. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 10:** జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియ పక్కడ్బందీగా జరగాలని స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఈఆర్ఓ , ఏఈఆర్ఓ మరియు తహసిల్దారులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిన్నటి రోజు వరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో భాగంగా మ్యాపింగ్ విషయంలో 77 శాతం తో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే ముందు ఉన్నదని తెలిపారు. అధికారులందరూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పారదర్శకంగా పనిచేయాలని ఏ ఒక్కరి మెప్పుకోసం పనిచేయవలసిన అవసరం లేదని తెలిపారు. బిఎల్ఓ లతో పనివేళలో మాత్రమే టెలికాన్ఫరెన్స్ లు , సమావేశాలు పెట్టుకుని వారిని చైతన్యపరిచి అత్యంత సులువుగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేసేలాగా ప్రేరేపించాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వలస వెళ్లిన వారి ఓటు హక్కును తొలగించరాదని , అన్ని వివరాలు సమగ్రంగా క్రోడీకరించుకొని అప్పుడు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బి ఎల్ వోలు ఇంటింటికి ఈనెల 15వ తారీకు నుండి వచ్చేనెల 14వ తారీకు వరకు వెళ్లి వారికి ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చి వాటిలో సమగ్ర వివరాలు తీసుకోవాలని వారి ఫోటోలు కూడా తీసుకోవాలని తెలిపారు. ఇంటిలో ఎవరూ లేకపోతే , తాళం వేసి ఉంటే మూడుసార్లు ఆ ఇంటికి తప్పక వెళ్లాలని వివరాలు సేకరించాలని తెలియజేశారు. చనిపోయిన , శాశ్వతంగా వేరే ప్రదేశానికి వెళ్లిన , డబుల్ ఎంట్రీ డూప్లికేట్ మరియు ఇంటిలో లేని వారి వివరాలు అన్ని ఫారంలలో తీసుకొని నోటీసులు ఇచ్చి ఆపై వారు వివరాలు ఇవ్వనిచో జిల్లా ఎన్నికల అధికారికి నివేదించాలని తెలియజేశారు. 2002 మరియు 2025 ఓటర్ల లిస్టు తో మ్యాపింగ్ పట్టణాలలో 80 శాతం మిగిలిన ప్రదేశాలలో 90 శాతం తప్పక జరగాలని ఆ విధంగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ తయారు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డిఆర్ఓ వెంకటనారాయణమ్మ మరియు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాటించవలసిన పద్ధతులు , తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశం కు పాణ్యం ఎన్నికల అధికారి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , వీఆర్వో వెంకటనారాయణమ్మ , కర్నూలు, పత్తికొండ , కోడుమూరు, ఎమ్మిగనూరు , మంత్రాలయం , ఆదోని , ఆలూరు ఈ ఆర్ ఓ లు చల్లా ఓబులేసు , చిన్న ఓబులేసు , సందీప్ కుమార్, అనురాధ , మధుసూదన్ రెడ్డి రామసుబ్బయ్య లు, అడిషనల్ కమిషనర్ కృష్ణ , ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి జిల్లా లోని తాహసీల్దారులు పాల్గొన్నారు.

# విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 10:** నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మండలం యందలి పలు వరి విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా విత్తన శుద్ధి కేంద్రాలలో ప్రాసెసింగ్ రిజిస్టర్, డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ బిల్లులు, రైతు రషీదులు మరియు విత్తన నిల్వలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతి పొందిన రకాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని ప్రాసెస్సింగ్ ప్లాంట్ రిజిస్టర్ , డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ మరియు ఫౌండేషన్ సీడ్ రిజిస్టర్ కచ్చితంగా ,సక్రమంగా నిర్వహించాలని, అదేవిధంగా విత్తనాలు ప్రోసెసింగ్ చేసేప్పుడు కల్తీలు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అదేవిధంగా ప్యాకింగ్ చేసేప్పుడు కూడా ఒక రకంలో ఇంకో రకం విత్తనాలు కలవకుండా జాగ్రత్త పడాలని, విత్తన బాగ్స్ పై ఆ రకం ప్రమాణాలు అన్ని ఉండేలా చూస్కోవాలని చెప్పడం జరిగింది. ప్రతి నెల స్టాక్ రిపోర్టు తప్పని సరిగా మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా కార్యాలయానికి అందచేయలని చెప్పటం జరిగింది. విత్తన చట్టం 1966 కి అనుగుణంగా అన్ని పాటించి వ్యాపారం చేస్కోవాలని అలా లేనిచో విత్తన చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. ఈ తనిఖీల్లో ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధరరావు, నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, సాంకేతిక వ్యవసాయ అధికారి నిరంజన్ పాల్గొనటం జరిగినది.

## ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు ఎంపీ బైరెడ్డి శబరి స్వాగతం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 10:**
ఢిల్లీ పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలకడం జరిగిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి సమస్యకు రిజర్వాయర్ల నిర్మాణం శాశ్వత పరిష్కారం.

..విద్యుత్ ప్రమాదాల్లో చనిపోయిన వారికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.- ..జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి.












**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 10:**
కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని, అలాగే వర్షాలు రాకపోతే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని, ఈ సమస్యకు రిజర్వాయర్ల నిర్మాణం శాశ్వత పరిష్కారం అని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్యుత్, పాఠశాల విద్య తదితర అంశాల పై సమావేశంలో చర్చ సాగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ తుంగభద్ర, పెన్నా నదుల ద్వారా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, నీటిని నిల్వ చేసుకునే రిజర్వాయర్లు లేకపోవడంతో తాగునీరు, సాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ సూచనలు అందించాలని, తదుపరి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించి శాశ్వత పరిష్కారం సాధించేందుకు కృషి చేద్దామన్నారు. జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య, భూగర్భ జలాల కొరతను దృష్టిలో ఉంచుకుని కర్నూలులోని 6 మండలాలు మరియు నంద్యాలలోని 2 మండలాలు మొత్తం 8 మండలాల్లో మదర్ ప్లాంట్లు, గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు పని చేసేలా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని కోరారు. ఎన్ హెచ్-167 హైవే పనులు సంజామల మండలంలో మొదలై కొత్తపల్లె వరకు సాగుతున్నాయని, హైవే నిర్మాణం వల్ల గ్రామాలకు సంబంధించిన తాగునీటి పైప్‌లైన్లు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున, ముందుగా ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేసిన తర్వాతే ఉన్న పైప్‌లైన్లను తొలగించాలని జిల్లా పరిషత్ చైర్మన్ అధికారులకు సూచించారు. విద్యుత్ తీగలు రోడ్లపై తక్కువ ఎత్తులో ఉండటం వల్ల పశువులను వాహనంలో తీసుకొని వెళ్ళే సమయంలో లేదంటే ఎక్కువ లోడ్ తో వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. విద్యుత్ లైన్లను నార్మ్ ప్రకారం కనీస ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ విద్యుత్ అధికారులను కోరారు..విద్యుత్ ప్రమాదాల్లో చనిపోయిన వారికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో సందర్శించి టాయిలెట్లు, తాగునీరు/రన్నింగ్ వాటర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని, 10 వ తరగతి విద్యార్థుల ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

## నంద్యాలలో టిడిపి పట్టణ స్థాయి నాయకుల కీలక సమావేశం.

..రాబోయే ఎన్నికల పై దిశానిర్దేశం చేసిన ఎన్ఎండి ఫిరోజ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 10:**
నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో (దబ్బరాల మసీద్ సమీపంలో) బుధవారం నంద్యాల పట్టణ స్థాయి పార్టీ నాయకుల ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది. నంద్యాల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని అలాగే దొంగ ఓట్లు ఏవైనా ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎన్ఎండి ఫిరోజ్ దిశానిర్దేశం చేశారు. మునియార్ ఖలీల్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి మరియు పార్టీ అభ్యున్నతికి నాయకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే ప్రతి వార్డు తిరిగి ఓటర్ జాబితాలను సరిచూసుకొని అందులో ఏవైనా దొంగ ఓట్లు ఉంటే వాటిని వెంటనే మా దృష్టికి కానీ ఎలక్షన్ అధికారులకు కానీ తెలియజేయాలన్నారు. 2002లో ఓటర్ జాబితాని 2026 ఓటరు జాబితాని సరి చూడాలని ఎవరైనా ఊరి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, మరణించిన వారి ఓట్లు , డబల్ ఎంట్రీ ఓట్లను గమనించి వాటిని అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ స్థాయి కీలక నాయకులు, పార్టీ ముఖ్య నేతలు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్థికాభివృద్ధికి హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలే కీలకం.

..వనరులను సమర్థవంతంగా వినియోగిస్తే నంద్యాలను రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దవచ్చు.

..ప్రజలకు వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం. -.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 10:**
నంద్యాల జిల్లాలో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడం వల్ల అభివృద్ధి అవకాశాలు పరిమితమవుతున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అభివృద్ధి, ప్రజల ఆదాయ వృద్ధి, ప్రభుత్వ సేవల మెరుగుదలపై గుర్తింపు పొందిన సేవాసంఘాల సభ్యులతో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల వాటా 42 శాతం, సేవా రంగం వాటా 39 శాతం ఉండగా, పారిశ్రామిక రంగం వాటా కేవలం 19 శాతం మాత్రమే ఉందన్నారు. పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వల్ల జిల్లా ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు అధిక ఆదాయం అందించే రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం కేవలం 37 వేల హెక్టార్లలో సాగవుతున్న హార్టికల్చర్ పంటల ద్వారా సుమారు రూ. 7 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా, దాదాపు 2.5 లక్షల హెక్టార్లలో సాగవుతున్న వరి మరియు ఇతర సాంప్రదాయ పంటల ద్వారా కేవలం రూ. 3 వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తోందని వివరించారు. ఈ గణాంకాలే తోటపంటల ఆర్థిక ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. రైతుల ఆదాయాలను పెంచాలంటే హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాల విస్తరణకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.






నంద్యాల జిల్లాలో వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులలో 20 శాతం కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం కార్యాలయాల్లో కూర్చుని ఫైళ్లు క్లియర్ చేయడం మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలను అర్థం చేసుకుంటూ సానుభూతి, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఉద్యోగుల నుండి పనితీరు మెరుగుపరచడానికే తన సమయం ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోందని, దీంతో కొత్త అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి సారించే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు సేవలు ఎంత వేగంగా, సమర్థవంతంగా అందుతున్నాయన్నదే ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా మారిందన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేందుకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఉద్యోగులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాల్సిన సందర్భంలో కొన్నిసార్లు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేసే ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి తటస్థ వైఖరితో వ్యవహరిస్తూ, సర్వీస్ మరియు క్లాసిఫికేషన్ నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వర్తిస్తే చాలా సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే టాప్-5 జిల్లాల్లో ఒకటిగా నిలబెట్టడం సాధ్యమవుతుందని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# పచ్చని పొలాల్లో మృత్యుపాశం..
# విరుగుడు లేని విషానికి 'నిషేధం 'ఎప్పుడు.. ?

..గడ్డి మందు కాదు.. ప్రాణాలను హరించే కాలకూట విషం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 10:**
రైతన్న కష్టంతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు, నేడు ఒక భయంకరమైన విషపు నీడలో చిక్కుకున్నాయి. కలుపు మొక్కలను చంపడానికి వాడే పారాక్వాట్ అనే రసాయనం, కేవలం గడ్డిని మాత్రమే కాదు.. రైతన్నల ప్రాణాలను కూడా నిశ్శబ్దంగా బలి తీసుకుంటోంది.

పొలాల్లో కొట్టే ఈ మందు, నేడు పల్లెటూరి ప్రాణాలకు ఒక ఉరితాడులా మారుతోంది. ఈ విషానికి విరుగుడు లేకపోవడం వల్ల, క్షణికావేశంలో దీనిని తాగిన వారు ప్రాణాలు కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. 70 దేశాలు ఇప్పటికే దీనిని తరిమికొట్టినా, మన దగ్గర ఇంకా విచ్చలవిడిగా అమ్ముతుండటం విచారకరం.

**క్షణికావేశం.. ఆపై మృత్యువుతో పోరాటం**

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి మనస్పర్థలు, అప్పుల బాధ లేదా కుటుంబ కలహాలు.. కారణం ఏదైనా కావచ్చు, క్షణికావేశంలో రైతు చేతికి చిక్కేది పొలంలో ఉండే ఈ గడ్డి మందే.

**నిస్సహాయత :** "నన్ను కాపాడండి.. నా పిల్లలు ఏమైపోతారు?" అని బాధితులు ఆసుపత్రిలో వేడుకుంటున్నా, వైద్యులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి.

**విరుగుడు లేదు :** ప్రపంచవ్యాప్తంగా ఈ విషానికి ఇప్పటికీ సరైన విరుగుడు కనుగొనబడలేదు. ఇది శరీరంలోకి వెళ్ళిందంటే మరణ శాసనం రాసుకున్నట్టే.

**ఊపిరిని బంధించే కర్కశత్వం**

పారాక్వాట్ శరీరంలోకి ప్రవేశించాక అత్యంత క్రూరంగా ప్రవర్తిస్తుంది:

**పల్మనరీ ఫైబ్రోసిస్ :** ఊపిరితిత్తుల కణజాలాన్ని రాయిలా గట్టిపడేలా చేస్తుంది. బాధితుడు స్పృహలో ఉన్నా, గాలి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ ప్రాణాలు వదులుతాడు.

**అవయవాల వైఫల్యం:** ఊపిరితిత్తులతో పాటు కిడ్నీలు, కాలేయం క్రమంగా కుప్పకూలుతాయి.

**నరకయాతన:** ఈ విష ప్రభావం వల్ల మనిషి వెంటనే చనిపోడు; రోజులు లేదా వారాల పాటు నరకాన్ని అనుభవిస్తూ మృత్యువు వైపు సాగుతాడు.

**ప్రపంచం వద్దన్నా.. మనకెందుకు ఈ మొండితనం?**

ఈ రసాయనం యొక్క తీవ్రతను గుర్తించి బ్రిటన్, స్విట్జర్లాండ్, చైనా, యూరోపియన్ యూనియన్ సహా సుమారు 70కి పైగా దేశాలు దీనిని పూర్తిగా నిషేధించాయి.

మన దేశంలో కొన్ని పంటలకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటల్లో విచ్చలవిడిగా వాడుతున్నారు.

లైసెన్సు నిబంధనలు ఉన్నా, క్షేత్రస్థాయిలో నియంత్రణ లేకపోవడంతో ఇది కిరాణా కొట్టులో వస్తువులా సులభంగా లభిస్తోంది.

**నేలతల్లికి కూడా తీరని నష్టం**

ఇది కేవలం మనుషులకే కాదు, పర్యావరణానికి కూడా గొడ్డలి పెట్టు:

**జీవవైవిధ్యం:** భూమిలో మేలు చేసే వానపాములు, సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది.




**కలుషితం:** వర్షపు నీటితో కలిసి బావులు, చెరువుల్లోకి చేరి నీటి వనరులను విషతుల్యం చేస్తోంది.

**ఆహార భద్రత:** పంటల ద్వారా ఈ రసాయన అవశేషాలు మనం తినే ఆహారంలోకి చేరి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి.

**పరిష్కారం దిశగా అడుగులు**

కలుపు నియంత్రణకు పారాక్వాట్ ఒక్కటే మార్గం కాదు. సురక్షితమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి:

కలుపు తీసే చిన్నపాటి యాంత్రిక పరికరాలు .మల్చింగ్ పద్ధతులు మరియు అంతర పంటల సాగు. సహజ సిద్ధమైన కలుపు నివారణ పద్ధతులు.

**నియంత్రణ కాదు.. నిషేధమే శరణ్యం!**

తెలంగాణ ప్రభుత్వం పారాక్వాట్ విక్రయాలపై ఇటీవల కొన్ని ఆంక్షలు విధించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. కేవలం 'నియంత్రణ' తో సరిపెట్టుకుంటే చాలదు, 70 దేశాలు ఇప్పటికే తరిమికొట్టిన ఈ కాలకూట విషంపై 'సంపూర్ణ నిషేధం' విధించడమే సబబు.

కఠిన చర్యలు: వ్యవసాయ అధికారుల రాతపూర్వక అనుమతి (లేనిదే ఏ ఒక్క లీటరు మందు కూడా విక్రయించకుండా విక్రయ కేంద్రాలపై ఉక్కుపాదం మోపాలి.

ప్రత్యామ్నాయ సాగు: గడ్డి మందుపై ఆధారపడకుండా, కలుపు నివారణకు వాడే యాంత్రిక పరికరాలపై రైతులకు భారీగా సబ్సిడీలు అందించి ప్రోత్సహించాలి.

అవగాహన కల్పించాలి: ఈ రసాయనం వల్ల కలిగే ప్రాణాపాయంపై గ్రామస్థాయిలో రైతులకు, వారి కుటుంబాలకు విస్తృత అవగాహన కల్పించాలి. పారాక్వాట్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడం ద్వారానే మన అన్నదాతను, నేలతల్లిని కాపాడుకోగలం. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని, నియంత్రణల నుంచి నిషేధం దిశగా అడుగులు వేయాలి!

**-డా. ఆర్ఎస్ఎస్ స్వతంత్ర శాస్త్రవేత్త**
**రామిశెట్టి శివశంకర్,**
**చైర్మన్, డా. ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్.**

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి.. అనర్హుల పేర్లకు తావివ్వొద్దు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి. ..బీఎల్ఓలకు కలెక్టర్ దిశానిర్దేశం.

..జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా.. సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల. -.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 10:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలకు చెందిన బీఎల్ఓలు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ లు స్వయంగా పాల్గొని మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం ఓటరు జాబితాల రూపకల్పన, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిర్వహణ జరుగుతుందని వివరించారు. తప్పుడు వివరాలతో డిక్లరేషన్ సమర్పించే ఓటర్లపై ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-31 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై సెక్షన్-32 కింద కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం కానున్నప్పటికీ, అప్పటి వరకు వేచి ఉండకుండా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వెంటనే ప్రారంభించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ప్రతి అర్హ ఓటరుకు ఫారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు రాజకీయ పక్షపాతం లేకుండా పూర్తిగా తటస్థంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జూలై 14లోపు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పోలింగ్ కేంద్రాల విభజన చేపట్టాలని, అయితే ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఆర్ఓలను ఆదేశించారు. అలాగే ప్రతి ఏఈఆర్ఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నంబర్ 1950ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సిస్టమ్ గుర్తించిన లోపాలు, వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, డోన్, బనగానపల్లె ఆర్డీఓలు, సంబంధిత నియోజకవర్గ మండలాల బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 11 జూన్ 2026

# తాగునీరు, విద్యుత్, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం.

**..నీటి ఎద్దడిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి.**

**..జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి.**

**..సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు/నంద్యాల, జూన్ 10:**
ఉమ్మడి కర్నూలు జిల్లాలో తాగునీటి సమస్యలు, విద్యుత్ భద్రత, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, విద్యాశాఖ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఉభయ జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మదర్ వాటర్ ప్లాంట్లు, ఆర్డబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 167కే రహదారి నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ల తొలగింపుకు ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, వర్షపాతం నమోదవుతున్నప్పటికీ నీటి నిల్వల కోసం తగిన రిజర్వాయర్లు లేకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తు



అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, నిల్వలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని వెంటనే సరిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం సకాలంలో అందించాలని, శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని, పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యాచరణకు మరింత ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

**సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

అనంతరం సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, అభ్యర్థనలపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఈ-క్రాప్ నమోదైన ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. పంట మార్పిడి చేసిన రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.
దొర్నిపాడు మండలంలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు విషయంలో భద్రతా చర్యలు చేపట్టి ప్రమాద హెచ్చరిక బోర్డులు, కంచె ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తపల్లి మండలంలో 167కే రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల భూముల నుంచి మట్టి తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గడివేముల మండలం సోమాపురంలో ఇళ్లపైకి దిగువకు వచ్చిన విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను పంపించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గువ్వలకుంట్ల-చిన్నపాలెం-సదరంచెరువు-ఎర్రగుడి చెరువు రహదారి పనులను వేగవంతం చేయాలని, ఆత్మకూరు నుంచి గువ్వలకుంట్ల వరకు విద్యార్థుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# మహానంది మండలంలో
## ఆగని ఎర్రమట్టి తవ్వకాలు..
### చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు.




**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 10:** మండలంలోని గోపవరం చెరువు సమీపంలోని వ్యవసాయ భూమి నుండి అక్రమంగా ఎర్రమట్టి రవాణా ఎత్తేచగా కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం మాకేమీ తెలియదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. వ్యవసాయ కళాశాల సమీపంలోని కాశిరెడ్డి నాయన పిల్ల కాలువగుండా వ్యవసాయ రైతులు తమ మాసూలు తరలించుకోవడానికి ఇబ్బందికరంగా మారుతుందని, టిప్పర్లు తిరగడం వలన వర్షాకాలం కావడంతో గుంతలుగా ఏర్పడి తమ పండించిన పంటను బయటకు చేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాలు, తరలింపులను నిలుపుదల చేయాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.

# నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణకు సంపూర్ణ మద్దతు.

**..నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగుదేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.**

**--రాయలసీమ సాగునీటి సాధన సమితి**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 10:**
నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీకి దారాదత్తం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా భారతీయ కిసాన్ సంఘ్ బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.
భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి ఆద్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, సంఘ్ నాయకులు సిద్దారెడ్డి, మహేశ్వరరెడ్డి, నందిరైతు సమాఖ్య నాయకులు కృష్ణారెడ్డి మరియు రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు మాట్లాడుతూ..
గత ప్రభుత్వ తిరోగమన నిర్ణయాల ఫలితంగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిశోధన స్థానం పరిధిలోని 50 ఎకరాల భూమిని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించడం, అదేవిధంగా అక్కడే



తాత్కాలిక కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం వల్ల రాయలసీమ రైతాంగానికే కాకుండా దేశవ్యాప్తంగా రైతులకు అవసరమైన పంటల విత్తనాల అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలకు కేంద్రబిందువుగా ఉన్న ఈ సంస్థ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థను బలహీనపరుస్తున్న చర్యలను అప్పట్లో తెలుగుదేశం పార్టీతో సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి.. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానాన్ని పరిరక్షించాలని బహిరంగంగా డిమాండ్ చేశాయని గుర్తు చేసారు. అయితే, 50 ఎకరాల భూమి ఇప్పటికే వైద్య కళాశాలకు కేటాయించబడిన నేపథ్యంలో, ప్రస్తుతం ఈ పరిశోధన సంస్థను కాపాడుకునేందుకు మిగిలిన అత్యంత కీలకమైన అవకాశం అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ప్రత్యామ్నాయ స్థలానికి తరలించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ అంశాన్ని తెలుగుదేశం పార్టీ నాయకత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డుకు గానీ లేదా ఇతర అనువైన ప్రదేశానికి గానీ తరలించి పరిశోధన స్థానాన్ని పరిరక్షిస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు.కానీ, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ అనే అత్యవసర అంశాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని 33 సంవత్సరాల కాలానికి సంవత్సరానికి కేవలం ?1,000 లీజు చొప్పున తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం అత్యంత విచారకరం. రైతుల భవిష్యత్తు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ కంటే పార్టీ కార్యాలయ నిర్మాణానికే ప్రాధాన్యత ఇవ్వడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యగా మేము భావిస్తున్నామన్నారు.
ఈ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ, రైతుల ప్రయోజనాల సాధన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం భారతీయ కిసాన్ సంఘం చేపట్టిన ఉద్యమానికి మా సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు.
అందువల్ల, రైతు హక్కులు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ మరియు ప్రజా ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డు స్థలాన్ని, అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థలాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి ఆద్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంఘాలు ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెల్తామని హామీ ఇచ్చారు.

## తండ్రికి క్యాన్సర్.. కూతురుకు తలలో గడ్డలు..

# సహాయం కోసం ఎదురుచూపులు..!


**...భార్యఅనారోగ్యంతో..వదిలేసిన కసాయి భర్త. ...మంచానికి పరిమితమైన తల్లి...దిక్కుతోచని చిన్నారులు.**

**...వైద్యం కోసం...ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు. ..మానవత్వంతో ఆదుకోవాలని తండ్రి,కూతురు ఎదురుచూపులు.**


**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 10:**
పేద వారి కుటుంబంపై విధి వక్రీకరించింది.కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వారిపై ఊహించని అనారోగ్య సమస్య వచ్చి పడింది.స్తోమతకు మించి అనారోగ్యానికి గురికావడంతో దిక్కు తోచక ఆ కుటుంబం జీవచ్ఛవంలా మానవతావాదుల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.రెక్కాడితే,డొక్కాడని ఆ కుటుంబానికి అనారోగ్య చిక్కు వచ్చి పడింది.పరీక్షలు చేసిన వైద్యులు ,వైద్య ఖర్చులు లక్షల్లో ఉంటుందని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.వివరాల్లోకి వెళితే మూలం పేటకు చెందిన బాబు కూలిపనులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.కొద్దిరోజులుగా పనులు చేసి ఇంటికి వచ్చే ఆయన తరచూ నీరసంగా ఉండడంతో కుటుంబసభ్యులు డాక్టర్ వద్దకు వెళ్ళారు.వైద్యులు పరీక్షలు చేసి క్యాన్సర్ వచ్చిందని చెప్పడంతో ఆ కుటుంబం కు ఏమి పాలుపోలేదు.ఈ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్న సమయంలోనే కూతురు సోనికి సైతం తల తిరగడంతో మళ్ళీ వైద్యులను సంప్రదించారు.వైద్యులు పరీక్షలు చేసి తలలో గడ్డలు ఉన్నాయని చెప్పారు.కలకాలం తోడు,నీడగా ఉండాల్సిన సోనీ భర్త వైద్యం చేయించే స్థోమత లేకపోవడంతో మానవత్వాన్ని మరిచి కట్టుకున్న భార్యను,ఇద్దరు చిన్నారులను వదిలి వెళ్ళిపోయాడు.ఇద్దరిని కాపాడుకోవాలని ఆ కుటుంబసభ్యులు బంధువులు,స్నేహితుల వద్ద కొంత డబ్బు తీసుకొని కొన్ని మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు.రోజు,రోజుకు వారి ఆరోగ్యం క్షీణిస్తుండ



డం తో దిక్కు తోచక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.ఆ కుటుంబం కన్నీటి గాథను ఎవరైనా చలించి ఆదుకుంటారని ఎదురుచూస్తున్నారు.మానవతావాదులు ఎవరైనా సహాయం చేసేవారు 9985909677 ఫోన్ పే చేసి ఆదుకోవాలని విగ్నేప్తి చేస్తున్నారు.





# జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి.

**..ఉద్యోగ సంఘాల ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు.**

**..స్టాఫ్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 10:**
జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని 30 గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో స్టాఫ్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, డిమాండ్లు మరియు సూచనలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులు ప్రధానంగా ఐఆర్, డీఏ, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్ట్ మరియు ఎన్ఎంఆర్ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాలకు పెంచడం వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సెలవుల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులను, మున్సిపల్ మరియు జెడ్పీ ఉద్యోగులు జెడ్పీఎఫ్ రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం, కార్యాలయాల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ, కంప్యూటర్లు, ప్రింటర్లు తదితర వసతుల కోసం తగిన బడ్జెట్ కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. ఈ-ఆఫీస్ శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన పంపించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అలాగే ఓఎస్‌లు, అటెండర్లకు యూనిఫాంలు అందించడం, అంతర జిల్లా బదిలీలకు అవకాశం కల్పించడం, మెడికల్ బిల్లుల పరిశీలనలో పారదర్శకత పాటించడం వంటి అంశాలను కలెక్టర్ కు వివరించారు. కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, ఆర్టీసీలో వాటి అమలును సమర్థవంతంగా చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న పాత మెడికల్ బిల్లులను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల



ప్రతినిధులు కోరారు. కొన్ని కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు తగిన శానిటేషన్, మరుగుదొడ్ల వసతులు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ట్రెజరీ శాఖలో ప్రొబేషన్, పదోన్నతుల ప్రక్రియలను వేగవంతం చేయాలని ప్రతినిధులు కోరగా, ఉపాధ్యాయ సంఘాలు గత ఏడాది బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయడం, సింగిల్ టీచర్ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుల నియామకం, ఖాళీ పోస్టుల రేషనలైజేషన్, విద్యార్థులకు అందించే పోషకాహార పదార్థాల సకాల సరఫరా వంటి అంశాలను కలెక్టర్ కు నివేదించారు. అలాగే పాత పాఠశాల భవనాల కూల్చివేత, నష్టపరిహారం చెల్లింపుల విషయాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జీజీహెచ్ ఆసుపత్రిలో మెడికల్ బిల్లుల స్క్రూటినీ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఉద్యోగ సంఘాలు సూచించారు.
సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల నుంచి మొత్తం 124 సమస్యలు, ప్రతిపాదనలకు సంబంధించిన వినతిపత్రాలు అందాయి. వాటిని జిల్లా కలెక్టర్ స్వయంగా నమోదు చేసుకుని, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిఆర్‌ఓను ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమం, పరిపాలన సామర్థ్య పెంపు రెండూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలని, ఉద్యోగ సంఘాలు సూచించిన సమస్యలను దశలవారీగా పరిశీలించి తగిన స్థాయిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు.